ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
చిత్తూరు జిల్లా వార్తలు
మంగళవారం 24 సెప్టెంబరు 2024



తిరుమలలో శాంతి హోమం

శ్రీవారి లడ్డూప్రసాదాల్లో వినియోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసి పవిత్రత దెబ్బతిన్నదనే అభిప్రాయాలకు మేరకు టీటీడీ పరిహారం కోసం సోమవారం శాంతి హోమం నిర్వహించింది. సంప్రోక్షణ నిర్వహించి పవిత్రతను తిరిగి పెంపొందించాలంటూ సీఎం, పలువురు మాజీ అధికారులు, పండితుల నుంచి అభిప్రాయాలు వ్యక్తమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో టీటీడీ ఆగమ సలహా మండలి సభ్యులైన వేణుగోపాలదీక్షితులు, మోహనరంగచార్యులు, రామకృష్ణదీక్షితులు, సీతారామచార్యులు, నూజివీడు గోపాలకృష్ణమాచార్యులు ఆలయంలో శాంతిహోమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. భక్తుల దర్శనాలకు, స్వామి కైంకర్యాలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉదయం 6 నుంచి 10 గంటల నడుమ ఆలయంలోని బంగారుబావి వద్దనున్న మండపంలో శాంతిహోం నిర్వహించారు. కలుషిత నెయ్యి వినియోగం జరిగిన ప్రతి ప్రదేశంలో తొలుత వాస్తుదూపాన్ని వేశారు. యాగశాలలో సంకల్పం, విశ్వక్సేనరాధన, పుణ్యాహవచనం, వాస్తుహోమం, కుంభప్రతిష్ఠ, పంచగవ్య ఆరాధన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. చివరిగా ఆలయంలోపల, బయటప్రాంతాల్లో కుంభప్రోక్షణ చేయడంతో శాంతిహోమం ముగిసింది. దీంతో సర్వదోషాలు తొలగిపోయాయని అర్చకులు తెలిపారు. క్రతువు ముగిసిన గంటల వ్యవధిలోనే తిరుమలలో చిరుజల్లులు కురవగా.. ఇది మంచి పరిణామమని పండితులు అభిప్రాయపడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





రాజుకున్న రాజకీయ వేడి

కల్తీ నెయ్యి వాడకంపై ఒకవైపు తిరుమల ఆలయంలో టీటీడీ శాంతి హోమం నిర్వహించగా.. మరోవైపు ఈ వివాదం రాజకీయంగా రాజుకుంది. టీటీడీ ఛైర్మన్‌గా తనపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో భూమన కరుణాకరరెడ్డి సోమవారం తిరుమలకు వెళ్లారు. రాజకీయ ప్రసంగం చేయకూడదని పోలీసులు నోటీసులివ్వగా సంతకం చేశారు. ఎంపీ గురుమూర్తి, కుమారుడు అభినయ్‌రెడ్డితో కలిసి వెళ్లిన ఆయన శ్రీవారి పుష్కరిణిలో స్నానం చేసి బేడి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అఖిలాండం వద్ద హారతి ఇచ్చే క్రమంలో ప్రార్థన చేస్తున్నట్లుగా.. రాజకీయ వ్యాఖ్యలు చేశారు. వెంటనే పోలీసులు అడ్డుకుని బలవంతంగా తిరుపతికి పంపారు. నిబంధనలు ఉల్లంఘించారని వివిధ సెక్షన్ల కింద ఆయనపై కేసు నమోదైంది కూడా. ఈ వివాదం కేంద్రంగా రాజకీయ వేడి రాజుకుంది. భూమన ప్రమాణాన్ని నిరసిస్తూ టీడీపీ నేతలు తిరుపతిలో గోవిందనామాలతో శ్రీవారిని ప్రార్థించారు. మరోవైపు భవిష్యత్తులో ఇలాంటి అపచారాలు జరగకూడదని శ్రీవారి ప్రార్థిస్తూ తిరుమలలో టెంకాయలు కొట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



మేము తప్పు చేసుంటే..

కల్తీ నెయ్యిలో మేం తప్పు చేసుంటే మా కుటుంబ సర్వనాశనమ్మై, రక్తం కక్కి చనిపోవాలని పుష్కరిణిలో మునిగి ప్రమాణం చేశా. నేను క్రిస్టియన్ కాదు.. నాస్తికుడిని అంతకన్నా కాదు. వీటిపై కూడా ప్రమాణం చేయమన్నా చేస్తా. సిట్ కాదు.. సీబీఐ, సిట్టింగ్ జడ్జి చేత విచారణ చేయించండి.

- భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ మాజీ ఛైర్మన్

నీ నాస్తిక ప్రమాణం ఒక ప్రామాణికమా?

● భూమనపై టీడీపీ నేతల ఆగ్రహం

తిరుపతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'నువ్వు నాస్తికుడివని ఊరంతా తెలుసు. అన్యమత అభిమానిగా అందరికీ పరిచయస్తుడివి. తిరుమల కొండపై నీలాంటి వ్యక్తి చేసే ప్రమాణాలకు ప్రామాణికత ఏముంటుంది?' అంటూ టీటీడీ మాజీ ఛైర్మన్, వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డిపై టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండపై భూమన చేసిన ప్రమాణాన్ని నిరసిస్తూ సోమవారం సాయంత్రం అలిపిరి గరుడ సర్కిల్లో గోవింద నామాలతో శ్రీవారిని ప్రార్థించారు. 'గత ఐదేళ్లలో తిరుమలను అపవిత్రం చేయడంతోనే చాలా దేవాలయాల్లో రథాలు కాలిపోయాయి. గోవిందరాజస్వామి గుడి వద్ద వటవృక్షం పడిపోయింది. తిరుమల కాలిబాటలో భక్తులను పులులు ఇబ్బంది పెట్టాయి. దేవుడంటే భయంలేదు కాబట్టే కొండపైన ప్రమాణాల డ్రామాలు ఆడారు' అని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ విమర్శించారు.



తిరుమల అఖిలాండం వద్ద ప్రమాణాలు చేసిన కరుణాకర్ రెడ్డి అవినీతి అక్రమాలు, దేవస్థానం ఖజానాను ఖాళీ చేసిన వైనం నీ పరాకాష్ఠకు నిదర్శనమని తుడా మాజీ ఛైర్మన్ నరసింహ యాదవ్ పేర్కొన్నారు. 'ఇప్పుడు చేసిన పాపాలు చాలవా? బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారి కోనేరును పరిశుభ్రం చేసి పవిత్రంగా ఉంచిన ఈ సందర్భంలో మళ్లీ ఆ కోనేట్లో స్నానం చేసి అపవిత్రాన్ని మూట కట్టుకున్నావు' అంటూ మండిపడ్డారు. ఆర్సీ మునికృష్ణ, శ్రీధర్ వర్మ, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, బుల్లెట్ రమణ, మనోహరాచారి, ఆముదాల తులసీరాం, ఈతమాకుల హేమంత్ యాదవ్, రవిశంకర్ యాదవ్, బ్యాంకు శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎవరు నెత్తురు కక్కాలో దేవుడు నిర్ణయిస్తాడు



గడిచిన ఐదేళ్లు తిరుమల కొండపై జరిగిన ఘోరాలను యావత్ హిందూ సమాజం చూసింది. లడ్డూ బాగలేదని తమిళనాడు నుంచి ఓ భక్త బృందం మాట్లాడితే విజిలెన్స్ వాళ్లతో కొట్టించలేదా? ఎవరు నెత్తురు కక్కాలో దేవుడు నిర్ణయిస్తాడు. వడ్డికాసులవాడు లెక్కలన్నీ తేలుస్తాడు. జరిగిన అపచారానికి ప్రాయశ్చిత్తం పొందకుండా జగన్ రెడ్డి ఎదురుదాడి చేయడమేంటో?

- ఓవీ రమణ, టీటీడీ మాజీ సభ్యుడు

శ్రీవారికి కొబ్బరికాయల సమర్పణ

తిరుమల, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): తిరుమల తెలుగుదేశం పార్టీ శ్రేణులు సోమవారం అఖిలాండం వద్ద కొబ్బరికాయలు సమర్పించారు. గత ప్రభుత్వంలో జరిగిన లోపాలు ఒకొక్కటిగా బయటకు వస్తుండంతో పాటు భవిష్యత్తులో ఎలాంటి అపచారాలు జరగకుండా ఆశీస్సులు ఇవ్వాలని స్వామిని ప్రార్థించారు. తిరుమల టీడీపీ అధ్యక్షుడు రాజుయాదవ్ ఆధ్వర్యంలో 501 కొబ్బరికాయలు సమర్పించారు. లడ్డూప్రసాదంలో వాడే నెయ్యిలో కల్తీ జరగడం బాధాకరమన్నారు. లడ్డూ నాణ్యత పెంచేవిషయంలో సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ వహించడంతో తిరిగి లడ్డూకు పవిత్ర చేకూరిందన్నారు.



కాణిపాకంలో నేడు ప్రాయశ్చిత్త శాంతి హోమం

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 23:ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో మంగళవారం లోకకల్యాణార్థం ప్రాయశ్చిత్త శాంతి హోమాన్ని నిర్వహించనున్నట్లు ఈవో గురుప్రసాద్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవదాయ శాఖ అధికారుల ఉత్తర్వుల మేరకు ఈ హోమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయ ఉభయదారులు, పరిసర గ్రామస్తులు, స్వామి భక్తులు ఈ హోమంలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రోడ్డుపైనే నిద్ర

రెండ్రోజులుగా సీపీఐ నారాయణ ఆధ్వర్యంలో దారి కోసం నిరసన తెలిపిన రైతులు

అధికారుల హామీతో ఉద్యమం వాయిదా



నారాయణతో చర్చిస్తున్న హైవే అథారిటీ చిత్తూరు పీడీ కార్తీక్‌రెడ్డి

నగరి/నింద్ర, సెప్టెంబరు 23: చిత్తూరు - తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవేకి సర్వీసు రోడ్డు కోసం సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆధ్వర్యంలో ఆదివారం బాధిత రైతులు నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. నింద్ర మండలానికి చెందిన పాదిరి వద్ద హైవేపై ఆదివారం వంటావార్పు, రహదారి దిగ్బంధం చేయగా, సోమవారం కూడా కొనసాగించారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి రైతులతో కలిసి నారాయణ కూడా రోడ్డుపైనే నిద్రించారు. సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలతో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్తీక్‌రెడ్డి, తహసీల్దార్ శేషగిరిరావు, హైవే అధికారులు నారాయణ వద్దకొచ్చి చర్చలు జరిపారు. సర్వీసు రోడ్డు, సబ్‌వే తదితరాలపై అధికారులు సానుకూలంగా స్పందించారు. సమస్యలను పరిష్కరించడానికి తమ సిబ్బందిని రైతుల వద్దకు పంపుతామని, వారి నివేదిక ప్రకారం పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఉద్యమాన్ని వాయిదా వేస్తున్నట్లు రైతులకు, ప్రజలకు నారాయణ తెలిపారు. కార్యక్రమంలో నగరి మండలానికి చెందిన అయనంబాకం, విజయపురం మండలానికి చెందిన కాళికాపురం, నింద్ర మండలానికి చెందిన పాదిరి గ్రామాల రైతులు, ఏపీ రైతు సంఘ రాష్ట్ర నాయకుడు రామానాయుడు, సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి నాగరాజు, చిరంజీవి నాయుడు, భాస్కర్‌రెడ్డి, సీపీఐ తిరుపతి జిల్లా సమితి సభ్యులు మహేష్, నగరి సీపీఐ కౌన్సిల్ సభ్యులు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూములిచ్చి ఇబ్బంది పడుతున్నాం



జాతీయ రహదారికి తమ భూములిచ్చి ఇబ్బంది పడుతున్నాం. మా భూమి మధ్యలో రోడ్డు రావడంతో ఇటువైపు పొలం నుంచి అటువైపు వెళ్లాలంటే వీలు కావడం లేదు. సర్వీసు రోడ్డు ఏర్పాటు చేస్తే ఈ సమస్య ఉండదు.

- చిరంజీవులు నాయుడు, పాదిరి

సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయకపోతే చావే గతి



చిత్తూరు-తచ్చూరు జాతీయ రహదారికి సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయకుంటే మాకు చావే గతి. పొలాల నుంచి ఇంటికి వెళ్లాలన్నా కిలోమీటర్లకుపైగా చుట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి. పండించిన పంట దిగుబడిని రోడ్డుపైకి తీసుకురావాలన్నా తిప్పలు పడాల్సిందే.

-లక్ష్మీకాంతమ్మ, పాదిరి

కైగల్, హంద్రీ-నీవాకు మహర్దశ



అప్పినపల్లె సమీపంలో హంద్రీ-నీవా కాలువను పరిశీలిస్తున్న నిమ్మలతో అమర్

నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

బైరెడ్డిపల్లె/పలమనేరు/కుప్పం/శాంతిపురం, సెప్టెంబరు 23: కైగల్, హంద్రీ-నీవా ఎత్తిపోతల ప్రాజెక్టు పనులకు త్వరలో మహర్దశ కలగనున్నట్లు నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. బైరెడ్డిపల్లె మండలంలోని కైగల్‌వద్ద ప్రాజెక్టు పనులు చేపట్టనున్న ప్రాంతాన్ని సోమవారం పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. వైసీపీ ఐదేళ్లపాలనలో రాయలసీమకు తీవ్ర అన్యాయం జరిగిందనడానికి హంద్రీ-నీవాయే ఉదాహరణ అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో హంద్రీ-నీవాకు రూ.4,200 కోట్లు ఖర్చుపెడితే, జగన్‌రెడ్డి గత ఐదేళ్లలో రూ.500 కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. గతంలో సీఎం చంద్రబాబు హంద్రీ-నీవా ద్వారా ప్రజలకు తాగు, సాగునీరు అందించాలనే లక్ష్యంతో 3,850 క్యూసెక్కుల సామర్థ్యానికి కృషిచేస్తే గడిచిన ఐదేళ్లలో కాలువకు సంబంధించి విస్తరణ, లైనింగ్ పనులు చేయలేదన్నారు. రాయలసీమకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశంతో చంద్రబాబు ఆదేశాలతో తెలుగుగంగ, హంద్రీనీవా, గాలేరు-నగరి పనులను పరిశీలించామన్నారు. పుంగనూరు కెనాల్, కుప్పం కెనాల్‌లో లైనింగ్ పనులను కూడా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కైగల్ ప్రాజెక్టుకు గతంలోనే చంద్రబాబు నిధులు మంజూరు చేసినా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా గాలికొదిలేసిందన్నారు. కైగల్ రిజర్వాయర్‌ను పూర్తిచేసి తాగు, సాగునీరు అందించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. అంతకుముందు మంత్రికి, ఎమ్మెల్యేకి స్థానిక టీడీపీ శ్రేణులు స్వాగతం పలికి సత్కరించాయి. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి తదితరులు పాల్గొన్నారు.



కైగల్ వద్ద ప్రాజెక్టు గురించి మంత్రికి వివరిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

వైసీపీ నిర్లక్ష్యం వల్లే 'హంద్రీ-నీవా' నీటిని వినియోగించుకోలేకపోయాం

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే 'హంద్రీ-నీవా' నీటిని వినియోగించుకోలేక పోయామని మంత్రి నిమ్మల మండిపడ్డారు. సోమవారం ఆయన పలమనేరు నియోజకవర్గంలోని పెద్దపంజాణి మండలంలోని అప్పినపల్లె సమీపంలో హంద్రీ-నీవా కాలువను పరిశీలించారు. పుంగనూరు బ్రాంచి కెనాల్‌కు సంబంధించి 220 కిలోమీటర్ల వైడనింగ్ అవసరమున్నచోట్ల లైనింగ్ పనులు వెంటనే చేపట్టేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అలాగే కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులకు సంబంధించి లైనింగ్ పనులు కూడా చేపట్టేలా చర్యలు తీసుకొంటామన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీతోపాటు పలమనేరు ఆర్డీవో మనోజ్‌రెడ్డి, టీడీపీ నాయకుడు సీఆర్ రాజన్ తదితరులు పాల్గొన్నారు.

రానున్న సీజన్‌కంతా కుప్పానికి హంద్రీ-నీవా జలాలు

రానున్న సీజన్‌కంతా హంద్రీ-నీవాను పూర్తిచేసి కుప్పానికి తాగు, సాగునీరు అందిస్తామని మంత్రి రామానాయుడు తెలిపారు. కుప్పం బ్రాంచ్ కెనాల్ పనుల పరిశీలనలో భాగంగా శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లె వద్ద కాలువను, కుప్పం మండలం పరమసముద్రం వద్ద హంద్రీ-నీవా ముగింపు పాయింట్‌ను సోమవారం పరిశీలించారు. జగన్ హయాంలో ఎన్నికల ప్రచారం కోసం రామకుప్పం మండలం వద్ద సినిమా సెట్టింగులను తలపించే రీతిలో తాత్కాలికంగా నీటిని విడుదలచేసి ఆయన వెళ్లగానే నీరు ఆగిపోవడం ప్రజలు గమనించారని ఎద్దేవ చేశారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో నాసిరకంగా జరిగిన రివిట్‌మెంట్ పనులను చూసి అసహనం వ్యక్తం చేశారు. పనులు ఇలా జరుగుతుంటే ఎలా మిన్నకున్నారని అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాధనం దోపిడీపై కాకుండా పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌పై పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టి పెట్టి ఉంటే హంద్రీ-నీవా పనులు ఎప్పుడో పూర్తయ్యేవని చెప్పారు. అలాగే కుప్పం మండలంలోని మాదనపల్లె, యామిగానిపల్లె వద్ద రూ.595 కోట్లతో రిజర్వాయర్ పనులకు ప్రతిపాదనలు సిద్ధంచేసి, ముఖ్యమంత్రికి పంపుతామని మంత్రి తెలియజేశారు. ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నం, కడా పీడీ వికాస్ మర్మత్, సురేష్‌బాబు, ఇరిగేషన్, హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష

కుప్పం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం రాత్రి హెచ్ఎన్ఎస్ఎస్, ఇరిగేషన్ శాఖ అధికారులతో మంత్రి సమీక్షించారు. అనంతపురం జిల్లా నుంచి పుట్టపర్తి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల మీదుగా కుప్పం వరకు జరుగుతున్న పనులపై ఆరా తీశారు. కాలువ పనులకు సంబంధించి 338 నిర్మాణాలకుగాను 20 పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. 268 నిర్మాణాలకు లైనింగ్ పనులు ఈ నవంబరు నెలాఖరులోగా పూర్తి చేయాలని మంత్రి నిర్దేశించారు. అలాగే పుంగనూరు బ్రాంచ్ కెనాల్ విస్తరణ పనులను అక్టోబరు నుంచి ప్రారంభించడానికి చర్యలు చేపట్టాలని చెప్పారు.

జడ్పీ సీఈవో బాధ్యతల స్వీకరణ

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 23: జడ్పీ సీఈవోగా రవికుమార్ నాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న గ్లోరియాను ప్రభుత్వం ఆమె మాతృ సంస్థకు బదిలీ చేసింది. బాధ్యతలు స్వీకరించిన రవికుమార్ నాయుడినరి డిప్యూటీ సీఈవో ఆదిశేషారెడ్డి, పలువురు అధికారులు సన్మానించారు.



రవికుమార్ నాయుడికి పుష్పగుచ్ఛమిస్తున్న ఆదిశేషారెడ్డి

19 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 23: జిల్లా వ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 19 మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరువర్షం కురిసింది. మండలాల వారీగా.. నదుంలో 34.2, పలమనేరులో 29.8, చౌడేపల్లెలో 28.4, గంగవరం, బంగారుపాళ్యంలో 25.4, సోమల, శాంతిపురంలో 24.6, రొంపిచెర్లలో 19.8, పెద్దపంజాణిలో 14.2, పులిచెర్లలో 14, ఐరాలలో 12.2, పుంగనూరులో 10.2, గుడుపల్లెలో 10, తవణంపల్లెలో 6.4, కుప్పంలో 6.3, గుడిపాలలో 3, వెదురుకుప్పంలో 2.4, పూతలపట్టులో 1.8, బైరెడ్డిపల్లెలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

రిజిస్ట్రేషన్ శాఖలో 71మంది బదిలీ

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 23: జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ పరిధిలో రెండేళ్లకు మించి ఒకేచోట పనిచేస్తున్న కిందిస్థాయి సిబ్బంది బదిలీలు ఆదివారం నిర్వహించారు. జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంతోపాటు డీఐజీ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న వారిలో 21మంది సీనియర్ అసిస్టెంట్లు, 32 మంది జూనియర్ అసిస్టెంట్లు, 18 మంది ఆఫీసు సబార్డినేట్ల బదిలీలు జరిగాయి.

డెంగ్యూ మృతిపై కలెక్టర్ విచారణకు ఆదేశం

● వికోటలో ముమ్మరంగా పారిశుధ్య పనులు



పట్టణంలో రాత్రి వేళ ఫాగింగ్

వి.కోట, సెప్టెంబరు 23: వి.కోటలో ఆరేళ్ల చిన్నారి డెంగ్యూతో మృతి చెందిన ఘటనపై కలెక్టర్ సుమిత్ కుమార్ విచారణకు ఆదేశించారు. వారం రోజుల వ్యవధిలో వి.కోటలో ఇద్దరు మృతి చెందడంపై తీవ్రంగా స్పందించారు. దీంతో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా మలేరియా నివారణాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ నేతృత్వంలో ఆరోగ్య సిబ్బంది సోమవారం మసీదు వీధికి చేరుకుని ఫాగింగ్ చేపట్టారు. ఓగు పీహెచ్‌సీ వైద్యులు రాజేష్‌నాయక్, ఏఎన్‌ఎంలు ఇంటింటా జ్వర బాధితులతో మాట్లాడి ఇబ్బందులను తెలుసుకుంటున్నారు. అవసరమైనవారికి మందులు అందజేశారు. పంచాయతీ సిబ్బంది వాడవాడలా ముమ్మరంగా పారిశుధ్య పనులను చేపట్టారు. ఈశ్వర్‌నగర్, భారత్‌నగర్, బ్రాహ్మణవీధి, జైభీంనగర్, ఎంజీరోడ్డు తదితర ప్రాంతాల్లో ఫాగింగ్ చేశారు.

రూ.13లక్షల టపాసుల సీజ్

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 23: పుంగనూరు పట్టణ పరిధిలోని మూడు టపాసుల దుకాణాలపై సోమవారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ చేసిన రూ.13 లక్షల టపాసులను సీజ్ చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. తాటిమాకులపాళ్యం, నగిరివీధి, భగత్‌సింగ్ కాలనీల్లో ఎస్ఐ రాజేశ్‌తో కలసి దాడులు నిర్వహించారు. టపాసులను సీజ్ చేసి బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

● కలెక్టర్ సుమిత్‌కుమార్



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 23: రోడ్డు ప్రమాదాల నివారణ బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఎస్పీ మణికంఠ, డీటీసీ నిరంజన్‌రెడ్డితో కలిసి జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 2024 జనవరి నుంచి నేటి వరకు 119 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 64 మంది

సమీక్షలు - సమావేశాలు

మృతి చెందగా, 211 మంది గాయపడ్డారని తెలిపారు. జిల్లాలో 69వ నెంబరు జాతీయ రహదారి 84 కిలోమీటర్ల పరిధిలో ఉందని, ఈ ప్రాంతాల్లోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇక్కడ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జాతీయ రహదారుల శాఖ అధికారులను ఆదేశించారు. అన్ని మున్సిపాలిటీల పరిధిలో లైటింగ్ ఉండేలా చూడాలన్నారు. పత్తికొండ, గంగవరం, బంగారుపాళ్యం, చిత్తూరు, గుడిపాల పీహెచ్‌సీ పరిధిల్లో రక్తం, అంబులెన్స్‌లు, నైట్‌డ్యూటీ డాక్టర్లు అందుబాటులో ఉంచాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ.. అతివేగమే ప్రమాదాలకు కారణమన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో సునీల్ కుమార్, ఎన్‌హెచ్ పీడీ వెంకటేశ్వర్లు, కార్తీక్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర విజన్‌ప్లాన్‌పై సూచనలు ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ తయారీకి ప్రజలు విలువైన సలహాలు, సూచనలు అందించి సీఎం ఫొటోతోపాటు ఆయన సంతకంతో కూడిన సర్టిఫికెట్‌ను పొందాలని కలెక్టర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను జేసీ విద్యాధరితో కలిసి ఆవిష్కరించారు. http://swarnandhra.ap.gov.in/ Suggestions. లింకుతో వచ్చే క్యూఆర్‌కోడ్ ద్వారా ఇందులో పాల్గొనాలని చెప్పారు. డీఆర్వో పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానశాఖ సేవలను అందిపుచ్చుకోండి

రాష్ట్రప్రభుత్వం ఉద్యాన రైతులకు అమలుచేస్తున్న వివిధ పథకాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో ఉద్యానశాఖ రూపొందించి న పోస్టర్‌ను జేసీ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ పలువురు జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రీయ కృషి విజ్ఞాన్ యోజన ఆయిల్ పంప్ పథకాలలో ఆర్థికంగా అందిస్తున్న సహాయాన్ని, సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాల్‌పోస్టర్లను రైతుల ఉపయోగంకోసం రైతు సేవాకేంద్రం, వ్యవసాయ, ఉద్యాన, ఎంపీడీవో కార్యాలయాల్లో ఉంచాలని సూచించారు. వ్యవసాయశాఖ అధికారి మురళీ కృష్ణ, ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, సీపీవో సాంబశివారెడ్డి, ఏపీఎంఐపీ పీడీ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కి 240 అర్జీలు

● న్యాయం చేయాలంటూ కలెక్టర్‌ను వేడుకున్న జనం



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, సెప్టెంబరు 23: కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం సోమవారం జరిగింది. కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు జేసీ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమ వంశీ, డీఆర్వో పుల్లయ్య, ఇతర అధికారులు జనం నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను ఆలకిస్తూ.. సంబంధిత అధికారులకు పరిష్కారం కోసం తగు సలహాలు, సూచనలు, ఆదేశాలిచ్చారు. రెవెన్యూ విషయాలపై సంబంధిత తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా, ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. కాగా, మొత్తం 240 మంది అర్జీలు వచ్చాయి. వీటిల్లో రెవెన్యూశాఖకు సంబంధించినవే 191 వరకు ఉన్నాయి. తమ సమస్యలు పరిష్కరించి, న్యాయం చేయాలని వేడుకున్నారు.


ప్రధానంగా వచ్చిన అర్జీల్లో కొన్ని..

● తాతలకాలం నుంచి అటవీ భూములు సాగుచేసుకుంటున్న తమకు పట్టాదారు పాసుపుస్తకాలను మంజూరు చేయాలని ఎస్ఆర్‌పురం మండలం మర్రిపల్లె ఎస్టీకాలనీకి చెందిన జయచంద్ర, నరసింహులు, బాలాజీ కోరారు. 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని, ఐదేళ్లుగా పట్టాలివ్వమని ప్రాధేయపడినా అధికారులు కనికరించలేదన్నారు. అటవీ హక్కు చట్టం 2005 ప్రకారం ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలను మంజూరు చేయాలని కోరారు.

● డప్పు కళాకారుల గుర్తింపు కార్డును ఇవ్వాలని పెద్దపంజాణి మండలం పెనుగొలకల దళితవాడకు చెందిన తిమ్మన్న కోరారు. డప్పు వృత్తిని నమ్ముకుని ఏళ్ల తరబడి జీవనం సాగిస్తున్నానన్నారు.

● తన భర్త ఆర్టీసీలో కండక్టర్‌గా ఉద్యోగం చేస్తూ అనారోగ్యంతో మృతి చెందారని, కారుణ్య నియామకం కింద ఉద్యోగావకాశాన్ని కల్పించాలని సోమల మండలం ఆవులపల్లెకు చెందిన శంకరమ్మ కోరారు. పలుమార్లు ఆర్టీసీ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదన్నారు.

ఎస్పీకి 31 అర్జీలు



బాధితురాలితో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌కి 31 మంది అర్జీదారులు హాజరయ్యారు. బాధితుల నుంచి ఎస్పీ మణికంఠ వినతిపత్రాలను స్వీకరించి, సమస్యలను ఓపిగ్గా విన్నారు. డీఎస్పీ సాయినాథ్ పాల్గొన్నారు.

కడపజోన్ ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి బదిలీ

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 23: కడపజోన్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిమ్మాడి చెంగల్‌రెడ్డి విజయవాడ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఇటీవల ఆయన పదోన్నతిపై కడపజోన్ ఈడీగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. వారం వ్యవధిలోనే బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఖాళీగా ఉన్న తిరుపతి డీపీటీవో పోస్టును రేపో మాపో భర్తీ చేయనున్నట్లు తెలిసింది. కడపజోన్ ఈడీగా పి.చంద్రశేఖర్, చిత్తూరు డీపీటీవోగా జగదీష్‌ను బదిలీ చేశారు. అలాగే వాకాడు డిపో మేనేజర్‌గా పెంచలయ్య, కుప్పం డిపో మేనేజర్‌గా గోపీనాథ్, శ్రీకాళహస్తి ఇన్‌చార్జి డీఎంగా తిరుపతి డిపో మేనేజర్ టి.బాలాజీ నియమించారు.



సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద భక్తుల కోలాహలం - ప్రాకారోత్సవంలో వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి - నాగులపుట్ట వద్ద భక్తుల పూజలు - శూలాలు గుచ్చుకుని వస్తున్న భక్తులు

వైభవంగా మూడో సోమవారోత్సవం

● భక్తజనసంద్రంగా రామకుప్పం

రామకుప్పం, సెప్టెంబరు 23: రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సోమవారం జరిగిన మూడో సోమవారోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించారు. పలమనేరు, కుప్పం నియోజకవర్గాలనుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు పట్టణాలు, గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు. కొందరు వెండితో చేసిన కళ్లు, చెవులు, నాగపడిగలు హుండీలో వేసి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు ఆలయ ఈశాన్య దిక్కున నాగులపుట్టలో పాలు, పండ్లు సమర్పించారు. పలువురు భక్తులు వీపుకు కొక్కీలు తగిలించుకుని తేర్లులాగుతూ, దవడలకు శూలాలు గుచ్చుకుని కావళ్లతో వచ్చారు. ఆలయ ఆవరణలోని నాగులమ్మ, శనీశ్వరస్వామి, పద్మావతి, వేంకటేశ్వరస్వామి ఆలయాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ కమిటీవారు దాతల సహకారంతో భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. డీఎస్పీ ప్రభాకర్, కుప్పం గ్రామీణ సీఐ మల్లేష్‌యాదవ్, రాళ్లబూదుగూరు, గుడుపల్లె ఎస్ఐలు నరేష్, శ్రీనివాసులు బందోబస్తు నిర్వహించారు.

టూరిజం కారిడార్ ఏర్పాటుకు ప్రతిపాదనలు



ననియాల వాచ్ టవర్‌పై నుంచి అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి

రామకుప్పం/కుప్పం, సెప్టెంబరు 23: రామకుప్పం మండలం ననియాల పర్యావరణ పర్యాటక కేంద్రం నుంచి కుప్పం మండలం కనకనాశమ్మ ఆలయం వరకు టూరిజం కారిడార్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదిస్తున్నట్లు అటవీ శాఖ రేంజ్ సీసీఎఫ్ నాగేశ్వరరావు, చిత్తూరు డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డిలు తెలిపారు. సోమవారం వారు ననియాలలోని పర్యావరణ పర్యాటక కేంద్రం, కనకనాశమ్మ ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుప్పం అటవీ ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి సీఎం చంద్రబాబు ప్రత్యేక ఆదేశాలిచ్చారన్నారు.అటవీ రేంజర్ జయశంకర్, ఆయా ప్రాంతాల అటవీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ జోన్ అటవీశాఖలో ముగిసిన బదిలీలు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 23: అటవీశాఖ రాయలసీమ జోన్-4 పరిధిలో ఫారెస్టు రేంజ్ అధికారుల బదిలీ పర్వం ముగిసింది. మొత్తం 21 మంది ఎఫ్ఆర్వోలను బదిలీ చేస్తూ ఫారెస్టు ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. చేపట్టిన బదిలీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎఫ్ఆర్వోలు అధికంగా ఉన్నారు. బదిలీ వివరాలు ఇలా ఉన్నాయి.. ఎఫ్ఎస్‌పీ, తిరుపతి ఎఫ్ఎస్‌డీలో పనిచేస్తున్న ఎన్.లక్ష్మీపతిని అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం రేంజ్‌కు బదిలీ చేయగా, సత్యవేడు డివిజన్‌లోని జి.జయప్రసాద్‌రావును అన్నమయ్య జిల్లా మదనపల్లె రేంజ్‌కు బదిలీ చేశారు. పీలేరు రేంజ్ ఎఫ్ఆర్వో బి.రాంలానాయక్‌ను తిరుపతి (ఎఫ్ఎస్ డివిజన్) ఫ్లయింగ్ స్క్వాడ్‌కు, తిరుపతి డీఆర్ఎస్ డిపోలోని బి.ప్రియాంకను పీలేరు రేంజ్ ఎఫ్ఆర్‌వోగా బదిలీ చేశారు. రాజంపేట రేంజ్‌లోని ఆర్.నారాయణను పలమనేరు రేంజ్‌కు, పీలేరు ఎఫ్ఎస్‌డీలోని ఎన్.వెంకటరమణను తిరుపతి డివిజన్ భాకరాపేటకు రేంజ్‌కు బదిలీ చేయగా, అక్కడి ఎం.దత్తాత్రేయను అన్నమయ్య డివిజన్ రాజంపేట రేంజ్‌కు బదిలీ చేశారు. మదనపల్లె డివిజన్ ఎఫ్ఆర్వో కె.మదన్‌మోహన్‌రెడ్డిని కడప ఫ్లయింగ్ స్క్వాడ్‌కు, తిరుపతి సోషల్ ఫారెస్టు ఎస్.రఘుశంకర్‌ను తిరుపతి సీఆర్ఎస్ డిపోకు బదిలీ చేశారు. కదిరి సోషల్ ఫారెస్టు రేంజ్ ఎస్.వెంకటసుబ్బుడును చిత్తూరు ఈస్టు రేంజ్‌కు,ఇక్కడి ఎన్.బాలకృష్ణారెడ్డిని నంద్యాల బంగనపల్లి సోషల్ ఫారెస్టు రేంజ్‌కు బదిలీ చేశారు. నంద్యాల జీబీఎం ప్రాజెక్టు టైగర్ ప్రాజెక్టు కె.త్రినాథ్‌రెడ్డిని తిరుపతి డివిజన్ సత్యవేడు రేంజ్‌కు, చిత్తూరు డివిజన్ పలమనేరు రేంజ్ జి.శివన్నను అన్నమయ్య డివిజన్ రాజంపేట రేంజ్‌కు బదిలీ చేశారు.

జిల్లాలో ఇలా..

చిత్తూరు జిల్లా అటవీ శాఖలోని పలు విభాగాల్లోని సిబ్బందిని బదిలీ చేస్తూ డీఎఫ్‌వో చైతన్యకుమార్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. 26 మంది ఫారెస్టు బీట్ అధికారులను బదిలీ చేయగా, ఐదుగురు ఫారెస్టు సెక్షన్ అధికారులను, ఒక జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు ఆఫీసు సబార్డినేట్‌ను బదిలీ చేశారు.

ఇకపై ఓటీపీ చెప్తేనే గ్యాస్ సిలిండర్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 23: వంటగ్యాస్ వినియోగదారులు నాలుగు అంకెల ఓటీపీ చెబితేనే ఇకపై సిలిండర్ల సరఫరా జరుగుతుందని హెచ్‌పీ గ్యాస్ చిత్తూరు, ట్రిప్లెక్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి రామమూర్తి తెలిపారు. గ్యాస్ బుకింగ్ చేశాక వినియోగదారుడి రిజిస్టర్ మొబైల్ నెంబర్‌కు నాలుగు అంకెల ఓటీపీ వస్తుందన్నారు. దానిని డెలివరీ బాయ్‌కి చెబితేనే సిలిండర్ అందజేస్తారన్నారు. ఈ మేరకు గ్యాస్ కంపెనీల ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సూర్యప్రభ వాహనంపై పార్వతీసుతుడు



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 23: కాణిపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా సోమవారం వరసిద్ధి వినాయకస్వామి సూర్యప్రభ వాహనంపై విహరించారు. ఈ కార్యక్రమానికి రాజమ్మ, రాజశేఖర్ నాయుడుల జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఇంద్రసేన నాయుడు, లక్ష్మీపతినాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం స్వామివారికి ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేకం చేశాక భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి ఉభయదారులు ఉభయ వరస తీసుకు రావడంతో కల్యాణ వేదిక వద్ద ఉత్సవర్లకు విశేష పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సిద్ధి, బుద్ధి సమేత వినాయకుడి ఉత్సవ విగ్రహాలను సూర్య ప్రభ వాహనంపై ఉంచి కాణిపాకం పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా ఆస్థాన మండపంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమాల్లో ఈవో గురుప్రసాద్, ఏఈవోలు విద్యాసాగర్‌రెడ్డి, ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి, ఉభయదారులు పాల్గొన్నారు. మంగళవారం స్వామికి చంద్రప్రభ వాహన సేవ నిర్వహించనున్నారు.



ఆస్థాన మండపంలో నృత్యం చేస్తున్న కళాకారులు - పాతాళభైరవి పౌరాణిక నాటికలో ఓ సన్నివేశం

డిస్కంలో భారీగా బదిలీలు

తిరుపతి, (ఆటోనగర్), సెప్టెంబరు 23: సదరన్ డిస్కంలోని తిరుపతి సర్కిల్‌లో 76 మంది ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఈఈలు 28, ఏడీఈలు 58 మందిని బదిలీ చేస్తూ సీఎండీ కె.సంతోషరావు ఉత్తర్వులు ఇచ్చారు. చేశారు. తిరుపతి సర్కిల్ పరిధిలో ఈఈల బదిలీల్లో భాగంగా తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న చంద్రశేఖర్ తిరుపతి టౌన్ డివిజన్ ఈఈగా.. ఆ స్థానంలో ఉన్న కె.వాసుదేవ రెడ్డిని చిత్తూరు ఎం ఎండ్‌పీకి బదిలీ చేశారు. తిరుపతిరూరల్ డివిజన్ ఈఈ మినహా మిగిలిన వారిని కూడా బదిలీ చేశారు. డీఈఈలను అధికారపార్టీ ప్రజాప్రతినిధుల సూచనల మేరకు బదిలీలు చేసినట్లు తెలిసింది.

దేవదాయ నూతన ఏసీ బాధ్యతల స్వీకరణ



చిట్టెమ్మ దంపతులను ఆశీర్వదిస్తున్న కోదండరామాలయ ఈవో, అర్చకుడు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 23: జిల్లా దేవదాయశాఖ నూతన అసిస్టెంట్ కమిషనరు (ఏసీ)గా కె.చిట్టెమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకున్న ఏసీ ప్రసన్నలక్ష్మి సూళ్లూరుపేటకు బదిలీ అయ్యారు. చిట్టెమ్మ సత్యసాయి జిల్లా కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈవోగా విధుల నిర్వహిస్తూ ఆదివారం ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీల్లో చిత్తూరు జిల్లాకొచ్చారు. ఈమెను కోదండరామాలయ ఈవో సుబ్రహ్మణ్యం నాయుడు, అర్చకుడు వేణుగోపాల్ ఆశీర్వదించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను చిట్టెమ్మ మర్యాద పూర్వకంగా కలిసి అక్టోబరు మూడో తేదీనుంచి కోదండరామాలయంలో నిర్వహించే వార్షిక పవిత్రోత్సవాలు, దశావతార దసరా ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఈవోలు తిమ్మారెడ్డి, కమలాకర్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.57 కోట్లు

తిరుమల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.57 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 82,436 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 25,437 మంది తలనీలాలు సమర్పించారు.

చర్యలు నిలిపివేస్తూ ఉత్తర్వులు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 23: స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ చిత్తూరు అర్బన్ (ఆర్వో) సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గతంలో అవినీతి నిరోధకశాఖ ఆకస్మిక తనిఖీ చేస్తూ నమోదు చేసిన కేసులో 10మందిపై తదుపరి శాఖాపరమైన చర్యలను నిలిపివేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 2018 నవంబరు 12న చిత్తూరు అర్బన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై అవినీతి నిరోధకశాఖ దాడి చేసింది. ఈ క్రమంలో అప్పటి సబ్‌రిజిస్ట్రార్‌తోపాటు కిందిస్థాయి సిబ్బందిసహా 10మందిపై ఏసీబీ అధికారులు కేసు నమోదుచేశారు. దీనిపై శాఖాపరమైన విచారణ జరిగింది. 10మందిపై నమోదు చేసిన అభియోగాలు నిరూపితం కాకపోవడంతో వారిపై తదుపరి చర్యలను నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం ఆ ఉత్తర్వులో పేర్కొంది.

టీటీడీ పరిరక్షణ కోసం..

- 27న పుంగనూరు నుంచి తిరుమలకు పాదయాత్ర

- బీసీవై అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్

పుంగనూరు, సెప్టెంబరు 23: టీటీడీ పరిరక్షణ కోసం ఈనెల 27వ తేదీన పుంగనూరు నుంచి తిరుమలకు పాదయాత్ర చేయనున్నట్లు బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఏడు డిమాండ్లతో పుంగనూరు నుంచి చౌడేపల్లె, సోమల, సదుం, కల్లూరు, పులిచెర్ల, రొంపిచెర్లక్రాస్, శ్రీనివాస మంగాపురం, అలిపిరి నుంచి తిరుమలకు మెట్లోత్సవం చేస్తూ పాదయాత్రగా వెళతామని ఆయన పేర్కొన్నారు.

ఏడు డిమాండ్లు ఇలా..

● తిరుమలలో జరిగిన అపచారాలు, అవినీతి అక్రమాలపై వంద రోజుల్లో విచారణ చేసి నిందితులను శిక్షించాలి. ● పాలక మండలి, పరిపాలన వరకు ప్రక్షాళన చేయాలి. పాలక మండలిలో రాజకీయ, కార్పొరేట్ శక్తులకు చోటు కల్పించరాదు. ● వీఐపీ బ్రేకు దర్శనాలు రద్దు చేసి.. సామాన్య భక్తులతోపాటు అందరికీ ఒకే దర్శనం ఏర్పాటు చేయాలి. ● టీడీపీలో అన్యమత ఉద్యోగులు తొలగించాలి, కొండపై వేయి కాళ్ల మండపానికి వేరొక చోట వెంటనే నిర్మించాలి. ● తిరుపతిలోని గోవిందరాజుస్వామి, కపిలతీర్థం, తిరుచానూరు అమ్మవారి ఆలయాలకు రెండు కిలోమీటర్ల దూరం వరకు మాంసం, మద్యం దుకాణాలు తొలగించాలి. ● తిరుమల ఆదాయాన్ని ప్రతి మూడు నెలకోసారి ఆడిట్ చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ● తిరుమలలోనే డెయిరీ ఏర్పాటు చేసి నెయ్యి తయారు చేయాలి.

డబుల్ డెక్కర్ ఫర్ సేల్

● సెకండ్ హ్యాండ్‌లో అమ్మేస్తాం కొనుక్కోండి ప్లీజ్

● బస్సును వదిలించేందుకు కార్పొరేషన్ బేరసారాలు



తిరుపతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ నేతలు కార్పొరేషన్ నిధులతో వెచ్చించి ఆర్భాటాల కోసం తీసుకొచ్చిన డబుల్ డెక్కర్ బస్సును అమ్ముకునేందుకు అధికారులు నానా తంటాలు పడుతున్నారు. ఎంతోకొంతకు అమ్మేస్తాం.. ప్లీజ్ అంటూ బేరసారాలు నడుపుతున్నారు. అయితే సెకండ్ హ్యాండ్‌లో అమ్ముతామన్న కొనేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో గార్బేజ్ షెడ్డులో పడున్న బస్సును వదిలించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. దాదాపు రూ2.5 కోట్ల ప్రజాధనం పోసి కొన్న ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సు చెత్తకుప్పల్లో దొరికే పాత బొమ్మలా మారిపోవడాన్ని సోమవారం కమిషనర్ ఎన్.మౌర్య దృష్టికి మీడియా ప్రతినిధులు తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆమె వైజాగ్ మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి తమదగ్గర డబుల్ డెక్కర్ బస్సు ఉందని ఏదోఒక ధరకు ఇచ్చేస్తామని చెప్పారు. డబుల్ డెక్కర్‌ పైన వైజాగ్‌లాంటి నగరపాలక సంస్థ కూడా అంగీకరించకపోవడంతో 'మీరే ఏదైనా మార్గం చెప్పండి' అని మీడియా ప్రతినిధులనే అడిగారు. ఇటీవల జూపార్కుకు మినీ డబుల్ డెక్కర్ బస్సును కొనుగోలు చేశారని, అక్కడ ప్రయత్నం చేయమని చెప్పడంతో విచారించమని అధికారులను ఆదేశించారు.

నాడు గొప్పలు.. నేడు తిప్పలు

దక్షిణ భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా తిరుపతికి డబుల్ డెక్కర్ బస్సు తీసుకొచ్చామని వైసీపీ స్థానిక నేతలు గొప్పలు చెప్పారు. అక్కరకు రాక దానిని అమ్ముకునేందుకు ఇప్పుడు అధికారులు తిప్పలు పడుతున్నారు. మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి గత ఏడాది ఆగస్టు 8న జరిగిన కౌన్సిల్లో ప్రతిపాదించి రూ2.30కోట్ల కార్పొరేషన్ సాధారణ నిధులనుంచి డబుల్ డెక్కర్ బస్సు కొనుగోలు చేయించారు. తొలుత బస్సును ఆర్టీసీకి అప్పగించి అద్దె వసూలు చేయాలనుకున్నారు. ఈ తరహా బస్సుల నిర్వహణకు ఎలాంటి నిబంధనలు లేకపోవడంతో వారు నిరాకరించారు. చివరకు కార్పొరేషన్ భుజాలకెత్తుకుంది. ఇరుకురోడ్లలో బస్సు రాకపోకలకు కష్టతరంగా మారడంతో రాత్రికిరాత్రే రెండువేలకు పైగా చెట్ల కొమ్మలను నేలకూల్చి, నిలువ నీడ లేకుండా చేశారు. గత ఏడాది అక్టోబరు 12న బస్సును రోడ్డుపైకి తీసుకొచ్చారు. ఎక్కడ ఎక్కి దిగినా రూ.50 బస్సు ఛార్జీని నిర్ణయించారు. రోజుకు పది మందికూడా ఎక్కకపోవడంతో కొంతకాలం ఉచితంగా తిప్పారు. బస్సుకు ఆర్టీసీ నుంచి ఎలాంటి రిజిస్ట్రేషన్ లేదు. కానీ దర్జాగా రోడ్లపై తిరిగేసింది. చట్టరీత్యా నేరం కావడంతో కార్పొరేషన్ అధికారులకు రవాణాశాఖ అధికారులు లేఖ రాశారు. బస్సు సీజ్ చేయాల్సివస్తుందని హెచ్చరించినట్లు తెలిసింది. దీంతో వినాయక సాగర్ వద్దగల గార్బేజ్ షెడ్డులో బస్సును పార్కు చేసి పెట్టేశారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి వితరణ



ప్రింటర్ అందజేస్తున్న పూర్వ విద్యార్థి నిర్మల

రొంపిచెర్ల, సెప్టెంబరు23: రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలో 1983-84లో పదవ తరగతి చదివిన రేవూరి నిర్మల ఔదార్యాన్ని చాటుకున్నారు. తాను చదివిన పాఠశాలతో పాటు బాలికల ఉన్నత పాఠశాలకు రూ.25 వేల విలువైన రెండు ప్రింటర్లు, జిరాక్స్, స్కానర్ పరికరాలను సోమవారం వితరణగా ఇచ్చారు. ప్రస్తుతం కర్నాటకలోని కోలారులో ఉంటున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఆమెను సత్కరించారు. రోసా అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు రమేష్, సభ్యులు లోకనాథరెడ్డి, సతీష్, మునిరాజ, కిషోర్, సుదాకరరెడ్డి వెంకటేశ్ పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ చట్టాలపై విద్యార్థినులకు పోటీలు



విజేతలకు సర్టిఫికెట్ అందజేత

రొంపిచెర్ల,సెప్టెంబరు23: రొంపిచెర్ల బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం బాలికల సంరక్షణకు చట్టాల ప్రాధాన్యత అవసరం అనే అంశంపై వ్యాస రచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వ్యాసరచనలో మొదటి స్థానం బాలికల పాఠశాల విద్యార్థిని స్నేహలత, రెండవ స్థానం ఆదర్శపాఠశాల విద్యార్థిని సుమియా, వక్తృత్వ పోటీల్లో మాడల్ స్కూల్ విద్యార్థి ఆసియా, బాలికల పాఠశాల విద్యార్థి అఫ్సియా, డ్రాయింట్ పోటీల్లో పెద్దమల్లెల పాఠశాల విద్యార్థి జేబిషాలిని, ఆదర్శపాఠశాల విద్యార్థి మయాన్‌బేగ్ విజేతలుగా నిలిచారు. వీరిని జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి, ప్రకాష్ పాల్గొన్నారు. విద్యార్థులకు సర్టిఫికేట్లు ఇచ్చారు.

స్వయంభేశ్వరస్వామి కల్యాణ మండపానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న శ్రీనివాసులు

సోమల, సెప్టెంబరు 23: సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా శివపార్వతుల కల్యాణ మండపం నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేసినట్లు ధర్మకర్త బీవీ సోమశేఖర్ తెలిపారు. సోమలకు చెందిన వరదం శ్రీనివాసులు రూ.15,116, దొంగిరి మనోహర్ రూ.10,116, మలిశెట్టి భారతమ్మ రూ.10,116, పాండురంగయ్య శెట్టి రూ.5,116, దాసరి లక్ష్మీదేవమ్మ, రూ.5,016, ఎన్. సారథి 15 సిమెంట్ బస్తాలు, దర్శిని హోటల్ గణేష్ 10బస్తాలు అందజేసినట్లు వివరించారు.

వర్షం కోసం కుంభాభిషేకం

స్వయంభేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు కుంభాభిషేకం నిర్వహించారు. వర్షాలు కురవాలని కోరుతూ 100 బిందెలతో స్వామివారికి జలాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వార్లను సుందరంగా అలంకరించి అభిషేకపూజలు జరిపారు. పొలిమేర అమ్మవార్లకు పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త బీవీ సోమశేఖర్, అర్చకులు విద్యాసాగర్ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య శిబిరం



పుంగనూరులో మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

పలమనేరు, సెప్టెంబరు23: స్వచ్ఛతా హీ సేవలో భాగంగా పలమనేరు ఏరియా ఆసుపత్రిలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. దీనిని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు పారిశుధ్య కార్మికుల ప్రాధాన్యతను గుర్తించి ఈ కార్యక్రమం చేపట్టాయన్నారు. ఆరోగ్య పరీక్షలు చేయించడంతో పాటు ప్రభుత్వ పథకాలు కూడా అందేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సమస్యలు పరిష్కారానికి తప్పకుండాచర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. వి.కోటలో ఇటీవల ఇద్దరు పిల్లలు డెంగ్యూ జ్వరంతో చనిపోయారని ప్రస్తావిస్తూ వైద్యులు, సిబ్బంది సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఆసుపత్రి సూపరింటిండెంట్ మమతారాణి, ఆర్ఎంఓ డాక్టర్ శారద తదితరులు పాల్గొన్నారు. **పుంగనూరు రూరల్:** మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి మున్సిపల్ మాట్లాడుతూ కార్మికులు ఆర్యోగంగా ఉంటే పట్టణ ప్రజలు ఆర్యోగంగా ఉంటారన్నారు. కార్మికులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, నాయకులు అయూబ్‌ఖాన్, నరసింహులు, వైద్యులు, పాల్గొన్నారు.

జగన్‌ను అరెస్టు చేయాలని పోలీసులకు ఫిర్యాదు



ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

కల్లూరు, సెప్టెంబర్ 23: తిరుమల లడ్డు నెయ్యి కల్తీ వివాదంలో మాజీ సీఎం జగన్, టీటీడీ మాజీ చైర్మన్లు కరుణాకర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, మాజీ ఈవో ధర్మారెడ్డిలను అరెస్టు చేయాలని ఎంపీటీసీ సభ్యులు ముని కృష్ణమనాయుడు, టీడీపీ నాయకులు గోపినాయుడు, కరుణాకర్‌నాయుడు, అరుణాచలంనాయుడు, వేణుగోపాల్‌నాయుడు, పార్థసారథినాయుడు డిమాండ్ చేశారు. సోమవారం వారు ఈమేరకు కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. శ్రీవారి ప్రసాదాలను అపవిత్రం చేసిన దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లడ్డు తయారీలో జంతువుల కొవ్వు పదార్థాలను వినియోగించి హిందువుల మనోభావాలను, ఆలయ పవిత్రతను దెబ్బతీసే వ్యక్తులు ఎంతటి వారైనా శిక్షించాలన్నారు. పాత్రధారులు, సూత్రధారులను గుర్తించి ఇటువంటి చర్యలకు భవిష్యత్తులో ఎవరూ పాల్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

మృతుని కుటుంబానికి మాజీ సైనికుల సాయం



పలమనేరు,సెప్టెంబరు23 : రోడ్డుప్రమాదంలో మృతి చెందిన మాదిగకల్లాడు గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబానికి పలమనేరు మాజీ సైనికోద్యోగుల సంఘం నాయకులు బాసటగా నిలిచింది. ఈనెల 10న గంగవరం మండలం మామడుగు వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో చంద్రశేఖర్‌రెడ్డి మృతిచెందారు. మృతుని కుటుంబానికి సోమవారం సంఘ ప్రతినిధులు రూ. 1,12,111 ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పయని, పలువురు మాజీ సైనికోద్యోగులు పాల్గొన్నారు.

సహాయ ఆచార్యునికి సత్కారం



గుడుపల్లె, సెప్టెంబరు 23: ద్రావిడ వర్సిటీలో తమిళశాఖ సహాయ ఆచార్యులు డా.గణేష్‌మూర్తి ఇటీవల తమిళనాడులోని విద్యా పరిశోధన అభివృద్ధి సంస్థ ద్వారా ఉత్తమ ఉపాధ్యా ఆవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్‌చాన్సలర్ ఆచార్య దొరస్వామి, రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్‌లు ఆయనను సోమవారం ఘనంగా సత్కరించారు.

130 మందికి ఉచిత వైద్యసేవలు



రామకుప్పం, సెప్టెంబరు 23: విజలాపురంలో సోమవారం ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 130మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. కార్యక్రమంలో వైద్యులు తిలక్, సిబ్బంది పార్థసారథి, ఝాన్సీరాణీ, టీడీపీ నేతలు శ్రీనివాసులురెడ్డి, కుమార్, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



ఎమ్మెల్సీ శ్రీకాంత్‌కు చెక్ అందజేస్తున్న నర్సరీ ప్రతినిధులు

శాంతిపురం, సెప్టెంబరు 23: విజయవాడ వరద బాధితులకు నియోజక వర్గ నర్సరీ యాజమాన్యం రూ. 50 వేల ఆర్థిక సాయాన్ని అందించింది. సోమవారం కుప్పంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను కలసి యాజమాన్యాల ప్రతినిధులు ఈమొత్తాన్ని అందజేశారు. నర్సరీ యాజమాన్యం క్యాబేజి మురళీ, గుణశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, జయారెడ్డి, చంద్రా, తిమ్మారెడ్డి, రత్నప్ప ఉన్నారు

చెరకు టన్నుకు మద్దతు ధర రూ.3151

నగరి/ శ్రీరంగరాజపురం, సెప్టెంబరు23: ఎస్ఆర్‌పురం మండల పరిధిలోని సాగర్ చక్కెర కర్మాగార యాజమాన్యం టన్ను చెరకుకు రూ3151 మద్దతు ధర నిర్ణయించినట్లు చెరకు రైతులు పేర్కొన్నారు. షుగర్ ఫ్యాక్టరీ చైర్మన్ జయమురుగన్ సోమవారం క్రషింగ్‌ను ప్రారంభించారు. 10 కిలోమీటర్ల వరకు రవాణా చార్జీలను రైతులు భరించుకోవాల్సి వుంటుందని ఆపై దూరానికి పరిశ్రమ రవాణా చార్జీలను భరిస్తుందని వివరించారు. రాష్ట్ర రైతు అధ్యక్షుడు నాగేశ్వరావు, జనార్ధన్‌రాజు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని బాలుడికి గాయాలు

పాలసముద్రం, సెప్టెంబరు 23. ద్విచక్ర వాహనం ఢీకొని బాలుడికి గాయాలయ్యాయి. పాలసముద్రానికి చెందిన ప్రభాకర్ కుమారుడు ధరణి(9) స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠ శాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. సోమ వారం ఉదయం పాఠశాలకు వెళుతుండగా తమిళనాడు రాణిపేటకు చెందిన మహిధర్ ద్విచక్రవాహనంపై వేగంగా వస్తూ చిన్నారిని ఢీకొన్నాడు. గాయపడిన ధరణిని 108లో తమిళనాడు షోలింగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి వేలూరు సీఎంసీకి తరలించారు. ఎస్ఐ భారతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజావేదికలో మాట్లాడుతున్న అమరనాథరెడ్డి,వేదికపై ఎంపీ దగ్గుమళ్ల, పార్టీ నాయకులు,అధికారులు

పలమనేరు, సెప్టెంబరు23 : జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని చిత్తూరు పార్లమెంట్ సభ్యుడు దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే అమరనాథరెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం పెద్దపంజాణి మండలం శంకర్రాయలపేటలో 'ఇదిమంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ప్రజావేదిక నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ పట్టు రైతుల సమస్యల పరిష్కారానికి, సెరికల్చర్ షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో మామిడి రైతుల సమస్యల పరిష్కారానికి కూడా ప్రభుత్వం నుంచి సాయమందేలా చూస్తామన్నారు. ప్రజావేదికలో అవసరమైన పనుల చర్చించి పూర్తి చేస్తామన్నారు. ఎన్నికలు ఫలితాలు వచ్చిన మరుసటి నెలలోనే పెన్షను రూ.4వేలకు పెంచిన ఘనత చంద్రబాబునాయుడికే దక్కిందన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు మండల స్థాయి టీడీపీ నాయకులు పాల్గొన్నారు. **సోమల:** చిన్న ఉప్పరపల్లెలో సోమవారం 'ఇదిమంచి ప్రభుత్వం' కార్యక్రమం సందర్భంగా గ్రామసభ నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతి ఇంటికి తిరిగి ప్రగతి వివరాలతో కూడిన కరపత్రాలను అందజేస్తున్నామన్నారు. వల్లిగట్లలో సుబ్బరాయుడు, సోమలలో శివశంకర్, మహేంద్రబాబు, వెంకట సుబ్బయ్య, చిన్నఉప్పరపల్లెలో జనసేన మండల అధ్యక్షుడు నాగభూణంరాయల్, మాజీ ఎంపీటీసీ రమేశ్‌నాయుడు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల రహిత దేశమే లక్ష్యంగా ముందడుగు



కుప్పంలో మానవహారంగా ఏర్పడిన పీఈఎస్ విద్యార్థులు

కుప్పం, సెప్టెంబరు 23: మత్తు పదార్థ రహితంగా దేశాన్ని మార్చడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ అమలు చేస్తున్నాయని పీఈఎస్ వైద్య కళాశాల ప్రిన్సిపల్, డీన్ డాక్టర్ హెచ్.ఆర్.కృష్ణారావు అన్నారు. పీఈఎస్ వైద్య కళాశాల, నర్సింగ్ అలైడ్ హెల్త్ సైన్సెస్ విద్యార్థులు, అధ్యాపకులు కుప్పంలో సోమవారం నషా ముక్త భారత్ అభియాన్ ప్రేరణాత్మక ర్యాలీ నిర్వహించారు. పీఈఎస్ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ కుప్పంలోని ప్రధాన వీధుల మీదుగా సాగింది. ఆర్టీసీ బస్టాండు కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. మత్తు పదార్థ వ్యతిరేక సందేశాలతో కూడిన ప్లకార్డులు, పోస్టర్లు పట్టుకుని అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాల వ్యసన విముక్తి పోరాటంలో ముందుండాలని పిలుపునిచ్చారు.

కష్ట,నష్టాల్లోనూ చంద్రబాబు సుపరిపాలన



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, సెప్టెంబరు 23: రాష్ట్రంలో నెలకొన్న కష్ట, నష్టాలను సమర్థమంతంగా ఎదుర్కొని ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న ఘనత టీడీపీ అధినేత చంద్రబాబుకు దక్కిందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. సోమవారం శాంతిపురం మండలం శివరాంపురం, మొరసనపల్లె, కడపల్లె, కర్లగట్ట, 121 పెద్దూరు గ్రామాల్లో ప్రజావేదిక సభల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షోభంలోనూ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తూ వారి అభిమాన్ని చూరగొన్నారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు విశ్వనాథనాయుడు, మాజీ వైస్ ఎంపీపీ ఉదయ్‌కుమార్, నేతలు విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, నాగరాజు, ఎంపీడీవో కుమార్, అధికారులు, నాయకులు ఉన్నారు.

చెరువులకు హంద్రీ-నీవా జలాలు అందించాలి: టీడీపీ



మంత్రి రామానాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న రామకుప్పం టీడీపీ నేతలు

రామకుప్పం, సెప్టెంబరు 23: హంద్రీ-నీవా బ్రాంచ్ కెనాల్ పనుల పరిశీలనకు వచ్చిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడకు చెల్దిగానిపల్లె వద్ద టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, మాజీ వైస్ఎంపీపీ చిన్నికృష్ణల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు స్వాగతం పలికారు. హంద్రీ-నీవా కాలువ ద్వారా మండలంలోని చెరువులకు జలాలు అందించాలని, మండలంలో పలు జలవనరుల అభివృద్ధికి సహకరించాలని వారు ఈ సందర్భంగా ఆయనకు వినతిపత్రం అందించారు. సీఎం చంద్రబాబుతో చర్చించి చెరువులకు హంద్రీ-నీవా జలాలు అందించే విషయాన్ని, ఇతర జలవనరుల అభివృద్ధికి చర్యలు తీపుకుంటామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నేతలు రామ్మూర్తి, జయశంకర్, మహ్మద్‌రఫీ, కృష్ణానాయక్, సత్తి, సుబ్రీ, బాలరాజు, వెంకటరమణ, నాగభూషణం, కొళ్ళపల్లెబాబు, గిరిదాసు, నవీన్, సురేష్, రెడ్డిపురుషోత్తం పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



ప్రసంగిస్తున్న హజ్‌రత్ సయ్యద్ అలీపీరాన్

వి.కోట, సెప్టెంబరు 23: కృష్ణాపురం సయ్యద్ అలీ పీరాన్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త చిహ్నాల ప్రదర్శనను భక్తులు ఆసక్తిగా తిలకించారు. హిందూ, ముస్లింలు తరలివచ్చారు. అన్నప్రసాదాలను స్వీకరించారు. సీఐ సోమశేఖర్, ఎస్సై బాబులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హజరత్ హమీదుల్లా సాహెబ్, మౌలానా ముజాహీద్, మౌలానా సలీముద్దీన్, సయ్యద్ ఇస్మాయిల్, మహ్మద్ అలీ తదితరులు ఉన్నారు.

3 నుంచి చౌడేశ్వరి దేవి దసరా ఉత్సవాలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 23: గిరింపేట చౌడేశ్వరి దేవి ఆలయంలో అక్టోబరు మూడు నుంచి 13 వరకు దసరా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3న అమ్మవారికి 1008 బిందెల జలాభిషేకం, మహాలక్ష్మి అలంకారం, 4న బాల త్రిపుర సుందరి దేవి, 5న పంచముఖ గాయత్రిదేవి, 6న విష్ణు దుర్గాదేవి, 7న కాశి అన్నపూర్ణాదేవి, 8న సరస్వతి దేవి, 9న మహిషాసురమర్ధిని, 10న రాజరాజేశ్వరి దేవి, 11న చౌడేశ్వరి దేవి అలంకరణ చేయనున్నారు. 12 పవళింపుసేవ, 13 వసంతాలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు.

తిరుమల లడ్డూ కల్తీ బాధ్యులను కఠినంగా శిక్షించాలి : చల్లాబాబు



పుంగనూరు, సెప్టెంబరు 23: తిరుమల లడ్డూ ప్రసాదాల్లో కల్తీ నెయ్యి, జంతువుల కొవ్వు, వ్యర్థాలను కలిపి అపవిత్రం చేసిన వైసీపీ వారికి శిక్ష తప్పదని టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు చల్లా రామచంద్రారెడ్డి హెచ్చరించారు. సోమవారం పుంగనూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ నెయ్యి కల్తీ జరుగుతున్నా టీటీడీ అధికారులు, బోర్డు చైర్మన్, సభ్యులు, ప్రభుత్వం నిద్రపోతోందా అని ప్రశ్నించారు. కర్నాటక ఫెడరేషన్ మిల్క్ డెయిరీ దేవుడికి లాభం లేకుండా 15 ఏళ్లుగా నెయ్యి ఇస్తుండగా దాన్ని రద్దు చేసి కొత్త సంస్థ తక్కువ ధరకు టెండర్ వేస్తే ఎలా కేటాయిస్తారన్నారు. దీనిపై విచారించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సోమలలో మోస్తరు వర్షం

సోమల, సెప్టెంబరు 23: మండలంలో పలు చోట్ల ఆదివారం రాత్రి, సోమవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత నెల రోజులుగా వర్షం కురవకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు.

పొలం పిలుస్తోంది

సోమల, సెప్టెంబరు 23: సోమల మండలంలో మంగళవారం నుంచి పొలం పిలుస్తోంది గ్రామసభ నిర్వహిస్తున్నట్లు ఏవో సుధాకర్ తెలిపారు. 25న వల్లిగట్ల పంచాయతీలో, అక్టోబరు 1న తమ్మినాయనపల్లె, 3న సోమల, 8న ఇరికిపెంట, 9న ఎస్. నడింపల్లె, 15న నంజంపేట తదితర గ్రామాల్లో ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.

విద్యుత్‌శాఖ ఏడీఈగా శ్రీనివాసులు



పుంగనూరు రూరల్, సెప్టెంబరు 23: పుంగనూరు విద్యుత్‌శాఖ ఎస్పీడీసీఎల్ ఏడీఈగా పి.శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక ఏడీఈ కార్యాలయంలో ఆయన చిత్తూరు ఎస్పీఎం ఏడీఈగా బదిలీ అయిన రవికుమార్‌రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరా, ఇతర సమస్యలపై రైతులు, ప్రజలకు సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఏఈలు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

వరసిద్ధుడి అన్నదానానికి రూ.2 లక్షల విరాళం



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 23: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన విఘ్నేష్, చరితారెడ్డి రూ. 2,00,202లు సోమవారం అందించారు. విరాళదాతను సూపరింటెండెంట్ వాసు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామివారి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు.

26 నుంచి స్కూల్‌గేమ్స్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

చిత్తూరు క్రీడలు, సెప్టెంబరు 23: ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు 26వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వసంతవాణి ఒక ప్రకటనలో తెలిపారు. 26న చిత్తూరు డీఎస్ఏ మైదానంలో అథ్లెటిక్స్ అండర్ -14, 17 బాలబాలికల ఎంపిక పోటీలు జరుగుతాయని తెలియజేశారు. 30న క్రికెట్ అండర్-14 బాలురు పోటీలు, అక్టోబరు 1న వాలీబాల్ అండర్-17 బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు.

వరద బాధితులకు అండగా సీఎం



బోడిగుట్టపల్లెలో కరపత్రాలు అందిస్తున్న టీడీపీ నేతలు

వి.కోట, సెప్టెంబరు 23: విజయవాడ వరద బాధితులకు ముఖ్యమంత్రి చంద్రబాబు కొండంత అండగా నిలిచారని మండల టీడీపీఅధ్యక్షుడు రంగనాథ్ తెలిపారు. సోమవారం మండల సరిధిలోని వి.కోట, బోడిగుట్టపల్లె, కృష్ణాపురం, గోనుమాకులపల్లె, బైరుపల్లె, బి.సి.పల్లె పంచాయతీల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా కరపత్రాలు పంచుతూ వంద రోజుల పాలనలో ప్రభుత్వం చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ విశ్వనాథ్, నేతలు శబరీష్, సుబ్బన్న, నారాయణస్వామి, ముకుందా, రాము, కృష్ణప్ప, జయప్ప, బాబు, వెంకటేష్, మూర్తి, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరులో అంతమైన రాక్షస పాలన:ఎమ్మెల్సీ శ్రీకాంత్



మహిళలకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్, చల్లా రామచంద్రారెడ్డి, సాయి లోకేశ్

పుంగనూరు, సెప్టెంబరు 23: టీడీపీ కూటమి ప్రభుత్వం రాకతో పుంగనూరులో రాక్షసపాలన అంతమైందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. సోమవారం మంగళం పంచాయతీలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లు అవినీతి, అరాచకాలు, దౌర్జన్యాలు, దాడులు చేయగా వంద రోజుల్లోనే కూటమి ప్రభుత్వం జనరంజకపాలన అందిస్తోందన్నారు. టీటీడీ లడ్డూ ప్రసాదాల్లో కల్తీ నెయ్యితో అపవిత్రం చేసిన వైసీపీ నాయకులకు ప్రజలు నిలదీయాలన్నారు. బాధ్యులకు శిక్ష తప్పదన్నారు. కుప్పంలో చంద్రబాబును ఓడిస్తామని చెప్పిన పెద్దిరెడ్డికి ప్రతి సవాల్‌గా చంద్రబాబును ఓడిస్తే తాను రాజకీయాలకు దూరంగా ఉంటానికి సవాల్ విసిరినట్లు గుర్తుచేశారు. పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వరదబాధితులను ఆదుకోవడంలో సీఎం చంద్రబాబు తీసుకున్న చొరవ మరువలేమన్నారు. వందరోజుల్లో అమలు చేసిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిలో ఉందన్నారు. అనంతరం బీఎంఎస్‌క్లబ్ జరిగిన సమావేశంలో మాట్లాడారు. మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేసి సచివాలయం వద్ద మొక్కలు నాటారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, తహసీల్దార్ రాము, కమిషనర్ మధుసూధన్‌రెడ్డి, ఏడీఈ శ్రీనివాసులు, నాయకులు మాధవరెడ్డి, సీవీరెడ్డి, శ్రీకాంత్, దినేశ్, పోలీసు గిరి, సుహేల్‌బాషా, పడగాల రమణ, సుబ్రహ్మణ్యంరాజు, వెంకటముని యాదవ్, పతిరాజు, గంగాధర్, మదన్‌మోహన్, కృష్ణమరాజు, కవిత, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు. **రామకుప్పం:** బందార్లపల్లె, కొంగనపల్లెతో బాటూ పలుగ్రామాల్లో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం సభల్లో మండల టీడీపీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ వైస్ఎంపీపీ చిన్నికృష్ణలు పాల్గొన్నారు. సమావేశాల్లో ఎంపీడీఓ ఈశ్వరన్న, సర్పంచులు వాణీ, రాజగోపాల్, నేతలు మహ్మద్‌రఫీ, శ్రీనాథరెడ్డి, సుబ్రీ, బాలరాజు, కొళ్ళపల్లెబాబు, విజయ్‌కుమార్, మునిరెడ్డి, పెరుమాళ్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 23: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే మనం దరం ఆరోగ్యంగా ఉంటామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. సోమవారం చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన స్వచ్ఛతహీ సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు, ఆస్పత్రిలోని పారిశుధ్య కార్మికుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. చర్చివీధిలో ట్రాఫిక్ సమస్య కారణంగా 108 వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు కలుగుతోందని, ఇందు కోసం గంగనపల్లి వైపుగా ఆస్పత్రికి దారి ఏర్పాటు చేయాలని పలువురు ఎమ్మెల్యేను కోరారు. దీనికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అముదు, ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గాంధీ తదితరులు పాల్గొన్నారు.

హరివిల్లు లలిత కళావేదికకు మైక్‌సెట్ వితరణ

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 23: చిత్తూరు హరివిల్లు లలిత కళావేదికకు నగరానికి చెందిన మాజీ కౌన్సిలర్ పార్థసారథి నాయుడు రూ.20 వేలు విలువగల మైక్‌సెట్‌ను వితరణ చేశారు. సోమవారం స్థానిక తపోవనం పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ మైక్‌సెట్‌ను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కళావేదిక సభ్యులు భాస్కర్‌రెడ్డి, వీర రాఘవులు నాయుడు, శ్యామలాదేవి, హరినాయుడు, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

వేగంగా పీజీఆర్ఎస్ వినతుల పరిష్కారం

చిత్తూరు, సెప్టెంబరు 23: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) ద్వారా ప్రజలు అందించే వినతులను వేగంగా పరిష్కరించాలని నగర కమిషనర్ నరసింహప్రసాద్ సూచించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంఈ గోమతి, మేనేజర్ వర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు. ● చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహప్రసాద్‌ను నగరపాలక సంస్థ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలందించి శాలువాతో సత్కరించారు.

'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాల పంపిణీ

విజయపురం, సెప్టెంబరు 23: మండలంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక టీడీపీ నాయకులతో అధికారులు 100 రోజుల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను, పెంచిన పించన్ల కరపత్రాలను, స్టిక్కర్లను పంపిణీ చేశారు. సామిరెడ్డికండ్రిగ, శ్రీహరిపురం, మల్లారెడ్డికండ్రిగ, నారపరాజు కండ్రిగ పంచాయతీల్లో ప్రచారం చేశారు. పంచాయతీ కార్యదర్శి బాబు, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు దశరథ రాజు, నాయకులు రాఘవరాజు, చిన్నబ్బరాజు, సురేష్‌రాజు, ప్రకాష్‌యాదవ్, నర్సింహులుయాదవ్, సుధాకర్‌యాదవ్, భాస్కర్, నాథముని పాల్గొన్నారు.

సంప్రదాయ అంశాలే సాహిత్యానికి మూలం


జీవిత సత్యాలు గ్రంథావిష్కరణ చేస్తున్న సాహితీవేత్తలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 23: సమాజంలో వివిధ వర్గాలకు చెందిన సంప్రదాయాలు, సంస్కృతులే సాహిత్యానికి మూలం అని హరివిల్లు లలితకళా వేదిక అధ్యక్షులు బి.భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక తపోవనం ఉన్నత పాఠశాల్లో హరివిల్లు లలితకళా వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి శ్యామలాదేవి రచించిన 'జీవిత సత్యాలు 'గ్రంథావిష్కరణ జరిగింది. జీవిత సత్యాలు గ్రంథ సమీక్షను ప్రముఖ సాహితీవేత్త హరినాయుడు నిర్వహించారు. అనంతరం రచయిత్రి శ్యామలాదేవిని, పార్థసారధినాయుడలను హరివిల్లు లలిత కళావేదిక నిర్వాహకులు మునుస్వామి, గోవిందన్, పాఠశాల హెచ్‌ఎంలు ఘనంగా సత్కరించారు.

3 నుంచి చౌడేశ్వరి దేవి దసరా ఉత్సవాలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 23: గిరింపేట చౌడేశ్వరి దేవి ఆలయంలో అక్టోబరు మూడు నుంచి 13 వరకు అమ్మవారి దసరా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3న అమ్మవారికి 1008 బిందెల జలాభిషేకం, మహాలక్ష్మి అలంకారం, 4న బాల త్రిపుర సుందరి దేవి, 5న పంచముఖ గాయత్రిదేవి, 6న విష్ణు దుర్గాదేవి, 7న కాశి అన్నపూర్ణాదేవి, 8న సరస్వతి దేవి, 9న మహిషాసురమర్ధిని, 10న రాజరాజేశ్వరి దేవి, 11న చౌడేశ్వరి దేవి అలంకరణ చేయనున్నారు. 12 పవళింపుసేవ, 13 వసంతాలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఉత్సవాలకు నగరవాసులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారి ఆశీర్వాదం పొందాలని కోరారు.

వరసిద్ధుడి అన్నదానానికి రూ.2 లక్షల విరాళం



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 23: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన విఘ్నేష్, చరితారెడ్డి రూ. 2,00,202లు సోమవారం అందించారు. విరాళదాతను సూపరింటెండెంట్ వాసు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామివారి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా త్యాగరాజు



వెదురుకుప్పం, సెప్టెంబరు 23: కార్వేటినగరం డిప్యూటీ తహసీల్దార్‌గా ఎం.త్యాగరాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. బదిలీల నేపథ్యంలో కలెక్టరేట్ నుంచి ఇక్కడకు వచ్చారు.

ఏపీఎంగా కవిత

వెదురుకుప్పం, సెప్టెంబరు 23: కార్వేటినగరం వెలుగు కార్యాలయం ఏపీఎంగా కవిత సోమవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. వెదురుకుప్పం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. అలాగే కార్వేటినగరం సీసీగా కళావతి బాధ్యతలు చేపట్టారు.

పంట రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

వెదురుకుప్పం, సెప్టెంబరు 23: స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఇచ్చే పంట రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి శాఖ చీఫ్ మేనేజరు ఇందిరా ప్రియదర్శిని కోరారు. సోమవారం కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేటలో రైతులకు పంట రుణాలపై అవగాహన కల్పించారు.

శ్రీవారి జోలికెళ్లి బాగుపడిన వారు లేరు


దీక్షలో దండం పెడుతున్న ఎమ్మెల్యే గురజాల, కూటమి నేతలు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 23: తిరుమల శ్రీవారి జోలికి వెళ్లినవారెవ్వరూ బాగుపడిన చరిత్రలేదని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ హెచ్చరించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ తయారీలో కల్తీ, శ్రీవారికి జరిగిన అపచారాలకు నిరసనగా కూటమి నేతల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద ప్రాయశ్చిత్త దీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ టీటీడీలో కల్తీ నెయ్యిపై హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. దీనిపై మాట్లాడుతుంటే రాజకీయం చేస్తున్నారని వైసీపీ నేతలు మాట్లాడటం శోచనీయమన్నారు. టీటీడీలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి దోషులకు తగిన శిక్షపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, మాజీ మేయర్ కటారి హేమలత, నేతలు బాలాజీ నాయుడు, గాంధీ, అశోక్, శేషాద్రి నాయుడు, దయారాం, యశ్వంత్, పుష్ప, వెంకటేష్, మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ఆరోగ్యమే ధ్యేయం


డయాలసిస్ బాధితుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

నగరి, సెప్టెంబరు23: పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరి ఏరియా ఆస్పత్రిలో పారిశుధ్య కార్మికుల ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆయన మాట్లాడారు. పరిసరాలను, రోడ్లను, డ్రైనేజీలను శుభ్రపరిచే కార్మికుల ఆరోగ్యం బాగున్నపుడే పారిశుధ్యం వీలవుతుందన్నారు. అందుకే వారు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం డయాలసిస్ కేంద్రానికి వెళ్లి డయాలసిస్ రోగుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు జరీనా, కార్తి కేయన్, ప్రశాంతి, ఉష, శ్రీనాధ్, మహేష్, పూజిత, మౌనిక, లోకేష్, ప్రసాద్, అజిత, నాయకులు బాలాజీ, ఉమాపతిరాజు, పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే చంద్రబాబు లక్ష్యం

నగరి, సెప్టెంబరు23: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా చంద్రబాబు పాలన సాగు తోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరి మున్సిపాలిటీ పరిధి లోని కొత్తపేటలో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డీఎస్సీ, పింఛన్ల పెంపు, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుచేసి ప్రజలకు భరోసా ఇచ్చామన్నారు. గంజాయి, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటున్నామని వివరించారు. సిమెంటు రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ సమస్యలు తప్పకుండా పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, తహసీల్దార్ రవికుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌బాబు, శ్రీనివాసన్, మాణిక్య వాసన్, జ్యోతినాయుడు, కృష్ణారెడ్డి, టీఎన్‌టీయూసీ బాలాజీ, సురేష్ నాయుడు, కర్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలోనూ సంక్షేమం, అభివృద్ధి : ఎమ్మెల్యే మురళీమోహన్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, సెప్టెంబరు 23: సంక్షోభంలోనూ సంక్షేమంతో పాటు రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు పెడుతోందని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. మండలంలోని ఆకనంబట్టు గ్రామంలో సోమవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లారు. వందరోజుల కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గురవప్ప, ఎంపీడీవో ధనలక్ష్మి, మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, మాజీ కన్వీనర్ ప్రతాపనేని చంద్రమౌళి, హరీష్, దేవరాజులు నాయుడు పాల్గొన్నారు. కాగా అంతకు ముందు గ్రామంలో ఎమ్మెల్యేకు టీడీపీ నేత హరీష్ యూత్ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. శాలువలు, గజమాలతో సన్మానించారు.

తవణంపల్లె: మండలంలోని మేజరు పంచాయతీ అరగొండలో జనసేన, టీడీపీ కూటమి నాయకుల ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినోద్‌కుమార్, రఘుపతి, శీను, రంజిత్‌రెడ్డి, సంతోష్, సందీప్, నిశాంత్ పాల్గొన్నారు.

నింద్ర: రైతు సంఘ నాయకులు బాబు యాదవ్ ఆధ్వర్యంలో నెట్టేరి గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. మాజీ సర్పంచ్ క్రిష్టయ్య, నాయకులు వెంకటరత్నంనాయుడు, జగన్ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మండలంలోని తుంబపాళ్యంలో సర్పంచ్ ఉషశ్రీ ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలు పంచారు. మండలంలోని 41 పంచాయతీల్లోనూ ఆయా గ్రామాల టీడీపీ నాయకులు, సర్పంచ్‌లు, అధికారులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

సామిరెడ్డిపల్లెలో 'ఇది మంచి ప్రభుత్వం'


కరపత్రాలు పంపిణీ చేస్తున్న కార్జాల అరుణ

పెనుమూరు, సెప్టెంబరు 23 : మండలంలోని సామిరెడ్డిపల్లెలో సోమవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాల కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏకాంబరం, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మురళి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవమైనది

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 23: ఉపాధ్యాయ వృతి సమాజంలో ఎంతో గౌరవప్రదమైనదని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. సోమవారం స్థానిక పీసీఆర్ ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో కెరియర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ మైనారిటీ (సీఈడీఎం), అన్‌జుమన్ తరక్కీ ఉర్దూ విభాగం ఆధ్వర్యంలో పలువురికి టెట్- డీఎస్సీ ఉర్దూ మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. మేయర్ ఆముద, మాజీ మేయర్ కఠారి హేమలత, అధ్యాపకులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులు విక్రయించాలి

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 23: జిల్లాలో రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీ కృష్ణ అన్నారు. సోమవారం తన ఛాంబర్‌లో జిల్లాలోని ఎరువుల డీలర్లు, సేల్స్ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధిక ధరలకు విక్రయించరాదని, నాణ్యత, బ్రాండ్ లేని వాటిని విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏవో సుజాత పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం : పీఆర్‌టీయూ

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 23: విద్యారంగంలోని ఉపాధ్యాయ సమస్యలపై పీఆర్‌టీయూ నిరంతర పోరాటం చేస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రకాష్, కన్నన్ అన్నారు. సంఘం బలోపేతంలో భాగంగా సోమవారం చిత్తూరుతో పాటు పక్క మండలాల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు.

యాదమరి: మండలంలోని పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. యాదమరి, కాశిరాళ్ళ గొల్లపల్లి, వరిగపల్లి పాఠశాలల్లో ఉపాధ్యాయ సభ్యత్వ నమోదు నిర్వహించారు. పీఆర్టీయూ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకాచారి, మండల అధ్యక్షుడు శివప్రసాద్, సురేష్ రెడ్డి, ఆనంద్ పిళ్ళై, శంకర్ పాల్గొన్నారు.

ఆటల్లోనూ రాణించాలి



తవణంపల్లె, సెప్టెంబరు 23: విద్యార్థులు విద్యతో పాటు ఆటల్లోనూ రాణించాలని విశ్రాంత విద్యుత్ ఏఈ బాబు అన్నారు. సోమవారం మండలంలోని అరగొండ బాలికల పాఠశాలలో విద్యార్థులకు రూ.20వేలు విలువైన హాకీ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అరగొండ సబ్‌స్టేషన్ ఏడీ కిషోర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రఘురామకృష్ణమరాజుపై ఫిర్యాదు



నగరి,సెప్టెంబరు23: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించిన ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణమరాజుపై నగరి పోలీస్‌స్టేషన్‌లో అంబేడ్కర్ సంఘం నాయకులు, దళిత నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలోని ఏలూరుపాడు గ్రామంలో అంబేడ్కర్‌ను అవమాన పరచడం గర్హనీయమన్నారు. ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు.

డివిజన్ ఈఈగా సురేష్

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 23: ఉమ్మడి విద్యుత్ శాఖలో పలువురు అధికారులు, సిబ్బంది బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు రూరల్ డివిజన్ ఈఈగా సురేష్‌ను బదిలీ చేశారు. ఈయన తిరుపతి ఐటీ విభాగంలో ఈఈగా విధులు నిర్వహించారు. అలాగే చిత్తూరు టౌన్ డీఈగా ప్రసాద్‌ను, చిత్తూరు ఆర్2 సబ్‌డివిజన్ డీఈగా శేషాద్రిని, ఎస్‌పీఎం డీఈగా రవిని బదిలీ చేసింది. కాగా ఉమ్మడి జిల్లాలో 12 మంది ఈఈలు, 22 మంది డీఈలు, 50 మంది ఏఈలు, 13 మంది జేఈలు, ఏఏవోలు 5, జేఏవో 14, ఎస్‌ఏలు 24, జేఏలు 16 మందిని ప్రభుత్వం బదిలీ చేసింది.

26 నుంచి స్కూల్‌గేమ్స్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

చిత్తూరు క్రీడలు, సెప్టెంబరు 23: ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు 26వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వసంతవాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 26న చిత్తూరు డీఎస్ఏ మైదానంలో అథ్లెటిక్స్ అండర్ -14, 17 బాలబాలికల ఎంపిక పోటీలు జరుగుతాయని తెలియజేశారు. 30న క్రికెట్ అండర్-14 బాలుర పోటీలు, అక్టోబరు 1న వాలీబాల్ అండర్-17 బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు.

విద్యాసామగ్రి పంపిణీ



వెదురుకుప్పం, సెప్టెంబరు 23: వెదురుకుప్పం మండలం దేవళంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న టీచర్ లీలావతి అక్కడి విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు.

నందీశ్వరుడికి పూజలు

వెదురుకుప్పం, సెప్టెంబరు 23: వెదురుకుప్పం మండలం చవటగుంటలో ఉన్న ఆవుదేవర నందీశ్వరుడికి సోమవారం పాలాభిషేకం, అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జాతీయ క్రీడాపోటీలకు బయలుదేరిన క్రీడాకారులు

నగరి: జాతీయ స్థాయిలో జరిగే బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు రాష్ట్ర బాలికల, బాలుర జట్లు హర్యానాకు బయలు దేరినట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి బాలాజీ తెలిపారు. హర్యానా రాష్ట్రంలోని రోథక్‌లో గల సైనిక్ సెకండరీ స్కూలులో సెప్టెంబరు 25 నుంచి 29 వరకు పోటీలు జరుగుతాయని వివరించారు.

ఆడపిల్లలను రక్షించుకుందాం


విద్యార్థినులతో ఎంఈవో, ఉపాధ్యాయులు

బంగారుపాళ్యం, సెప్టెంబరు 23: ఆడపిల్లలను రక్షించుకుందామని ఎంఈవో రమేష్‌బాబు అన్నారు. మండలంలోని బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'ఆడపిల్లలను రక్షించుకుందాం' అనే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని ఉన్నత పాఠశాల విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్దన్ రెడ్డి, కుమారి, రోజారమణి, సుమిత్రమ్మ, లలిత పాల్గొన్నారు.

నెల్లూరు పీడీగా ఏపీవో గంగాభవాని

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 23: చిత్తూరు జిల్లా డ్వామా శాఖలో ఏపీవోగా పనిచేస్తున్న గంగాభవానీని నెల్లూరు జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టరుగా పదోన్నతి కల్పించారు. అలాగే చిత్తూరు డీఎల్డీవోగా పనిచేస్తున్న రవికుమార్‌ను కడప జిల్లా పులివెందుల డీఎల్డీవోగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో నెల్లూరు జిల్లా డీఎల్డీవో వసుమతిని నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుంది

● ఎంపీ దగ్గుమళ్ల, ఎమ్మెల్యే గురజాల


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 23: ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేస్తుందని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ స్పష్టంచేశారు. సోమవారం నగరంలోని 5వ డివిజన్ సాంబయ్య కండ్రిగలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పింఛను పెంచామన్నారు. మెగా డీఎస్సీకి శ్రీకారం చుట్టామన్నారు. అనంతరం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌తో కలిసి కూటమి నేతలు సీకేపల్లి రోడ్డులో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం 100 రోజుల్లో సాధించిన విజయాలను వివరిస్తూ కరపత్రాలను పంచారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నరసింహ ప్రసాద్, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, దుర్గా రామకృష్ణ, మాజీ మేయర్ కటారి హేమలత, త్యాగరాజన్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రూ.2.53లక్షల టపాకాయలు సీజ్

చిత్తూరు, సెప్టెంబరు 23: అక్రమంగా నిల్వవుంచిన టపాకాయలను రెండో పట్టణ పోలీసులు సీజ్ చేశారు. సీఐ నెట్టికంఠయ్య కథనం మేరకు.. తేనెబండకు చెందిన నరేష్ వినాయక చవితి వేడుకలకు అధిక ధరలకు విక్రయించాలనే ఉద్దేశంతో రూ.2.53 లక్షల విలువ చేసే టపాకాయలను ఇంట్లో నిల్వ ఉంచాడు. అతడిని అరెస్టు చేశారు. కేసు నమోదు చేశారు.

నగరపాలక సంస్థ ఏసీపీగా నాగేంద్ర



చిత్తూరు, సెప్టెంబరు 23: కడప అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ)గా వున్న పి. నాగేంద్రను చిత్తూరు నగర పాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. ఇక్కడ ఏసీపీగా వున్న రామకృష్ణను పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పుడా)కు బదిలీ చేసింది. అలాగే టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లుగా ఉన్న శారదను శ్రీకాళహస్తికి, జాకీరాను బి.కొత్తకోట నగర పంచాయతీకి బదిలీ చేసింది. పుంగనూరులో టీపీవోగా ఉన్న శుభప్రదను చిత్తూరు టీపీవోగా నియమించింది.

చెరకు టన్నుకు మద్దతు ధర రూ.3151

నగరి/ శ్రీరంగరాజపురం, సెప్టెంబరు23: ఎస్ఆర్‌పురం మండల పరిధిలోని సాగర్ చక్కెర కర్మాగార యాజమాన్యం టన్ను చెరకుకు రూ3151 మద్దతు ధర నిర్ణయించినట్లు చెరకు రైతులు పేర్కొన్నారు. షుగర్ ఫ్యాక్టరీ చైర్మన్ జయమురుగన్ సోమవారం క్రషింగ్‌ను ప్రారంభించారు. 10 కిలోమీటర్ల వరకు రవాణా ఛార్జీలను రైతులు భరించుకోవాల్సి వుంటుందని ఆపై దూరానికి పరిశ్రమ రవాణా చార్జీలను భరిస్తుందని వివరించారు. రాష్ట్ర రైతు అధ్యక్షుడు నాగేశ్వరావు, జనార్ధన్‌రాజు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 23: ప్రకృతి వ్యవసాయతో అధిక దిగుబడి వస్తుందని జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి వాసు తెలిపారు. సోమవారం మంగుంట గ్రామంలో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యవసాయ అధికారులు, రైతులు మంగుంట గ్రామంలో రైతు శేషాద్రి ప్రకృతి వ్యవసాయం విధానంలో పండించిన పంటలను పరిశీలించారు. అదేవిధంగా అటల్ భూజల్ యోజక పథకం గురించి మధ్యప్రదేశ్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేతలు డాక్టర్ ఆర్.ఎమ్. సింగ్, వివేక్, మోర్, హరేధర్‌సింగ్, రాంజీసింగ్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం, వాహనం సీజ్

చిత్తూరు, సెప్టెంబరు 23: రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఓ వాహనాన్ని రెండో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. వాహనాల తనిఖీల్లో భాగంగా సోమవారం పోలీసులు రెడ్డిగుంట చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించారు. గుడిపాల నుంచి పలమనేరు వైపు వెళ్తున్న లగేజ్ వాహనాన్ని ఆపి తనిఖీచేశారు. రూ.లక్ష విలువ చేసే రేషన్ బియ్యం, వాహనాన్ని సీజ్ చేశారు. డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తిని అరెస్టుచేసినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట



నగరి, సెప్టెంబరు23: ఓ ప్రేమజంట రక్షణ కోసం నగరి పోలీసులను ఆశ్రయించింది. కడప జిల్లా వేంపల్లెకు చెందిన బాబ్జాన్ కుమార్తె దిల్షాద్, రమణయ్య కుమారుడు జయప్రవీణ్ ప్రేమించుకున్నారు. జయకుమార్ నగరి పరిసర ప్రాంతంలో ఉద్యోగం చేస్తుండడంతో ఇక్కడి పోలీసులను ఆశ్రయించారు. వారు మేజర్లు కావడంతో తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వనున్నట్లు సీఐ మహేశ్వర్ తెలియజేశారు.

ఎంపీడీవోకు సన్మానం

పాలసముద్రం, సెప్టెంబరు 23: పాలసముద్రం ఎంపీడీవోగా పనిచేస్తున్న రామనాథరెడ్డి కడప జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన్ను ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ శ్యామల, కార్యాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏవో విద్యావతి, ఈవో పీఆర్డీ రమేష్, టీడీపీ నాయకులు శేఖర్‌రాజు, సాంబశివన్, అరుల్‌నాథన్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని బాలుడికి గాయాలు



పాలసముద్రం, సెప్టెంబరు 23: ద్విచక్ర వాహనం ఢీకొని బాలుడికి గాయాలయ్యాయి. పాలసముద్రానికి చెందిన ప్రభాకర్ కుమారుడు ధరణి(9) స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం పాఠశాలకు వెళుతుండగా తమిళనాడు రాణిపేటకు చెందిన మహిధర్ ద్విచక్రవాహనంపై వేగంగా వస్తూ చిన్నారిని ఢీకొన్నాడు. గాయపడిన ధరణిని 108లో తమిళనాడు షోలింగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి వేలూరు సీఎంసీకి తరలించారు. ఎస్ఐ భారతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.